www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 నవంబర్ 2025
5
అన్నమయ్య

3న జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగ క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించాలనిదిగా క్రీడా ప్రాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుండి వచ్చిన సూచనల మేరకు అన్ని ఏర్పాట్లను చేపడుతున్నామని జిల్లా క్రీడా ప్రాధికార అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా స్థాయిలో నాలుగు రకాల క్రీడా విభాగాల్లో పోటీలను ఈ నెల 27 లోపు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 25వ తేదీన రాయచోటి డిఎస్ఎ క్రికెట్ స్టేడియంలో పరా అథ్లెట్లకు పోటీ నిర్వహించనున్నారు. బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్, వీల్‌చైర్ నిర్వహిస్తున్నామన్నారు. వికలాంగ క్రీడలకు ప్రోత్సాహం, అవగాహన కల్పించే లక్ష్యంతో దివ్యాంగ సంక్షేమ శాఖ, పరాస్పోర్ట్స్ అసోసియేషన్ సమన్వయంతో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి అవగాహన ర్యాలీలో పాల్గొనేటట్లు స్థానిక క్రీడా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన దివ్యాంగ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి, నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 8712622 575 సంప్రదించాలన్నారు.

కార్మిక హక్కులు హరించడమే

- లేబర్ కోడ్ల నోటిఫికేషన్ పత్రాల దహనంలో నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పెట్టుబడి దారి ఏకపక్ష అనుకూలంగా కార్మిక వ్యతిరేకంగా నిరసనగా జిఒ పత్రాలను నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలను, నిరసన ఆందోళనలను బేఖాతర్ చేస్తుందని కార్మిక చట్టాలకు వలస పాలన వాసనలు ఉన్నాయని వాటిని ఆధునికీకరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస పాలనకు మించి బానిసత్వాన్ని కార్మికవర్గం మీద రుద్దేందుకు కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేసేందుకు నాలుగు లేబర్ కోడ్లలో అనేకమైన కార్మిక వ్యతిరేక మార్పులను చొప్పించారని విమర్శించారు. ఏదైనా కర్మాగారం లేదా కంపెనీ లేఆఫ్ చేయాలన్నా, లాకౌట్ చేయాలన్నా 100 మంది అంతకుమించిన కార్మికులు ఉంటే ఆ సంస్థ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ షరతు 300 మంది కార్మికులు ఉన్న కంపెనీలకు ఫ్యాక్టరీలకు వర్తించే విధంగా మార్చారన్నారు. 300 లోపు కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు కంపెనీల యజమానులు తమ ఇష్టానుసారం పరిశ్రమలను లే-ఆఫ్ లేదా లాకౌట్ చేసుకునే వెసులుబాటు కల్పించారని బెదిరిస్తూ కార్మికుల హక్కుల మీద ఉద్యోగ భద్రత, జీతభత్యాల మీద వేటు వేసేందుకు, రాత్రి పూట డ్యూటీలు వేసేందుకు, యాజమాన్యాలకు ఆయుధం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఆయుధాలు ఈ లేబర్ కోడ్ల ద్వారా కార్పొరేట్లకు అనుకూలంగా అందిస్తున్నారు. సంఘం పెట్టుకునే స్వేచ్ఛ హక్కు, జీతాల పెంపుల చట్టం అన్ని రద్దు చేసి జీతాలు పెంచకుండా పని గంటలు పెంచి శారీరక మానసిక శ్రమ దోపిడీతో సామాజిక సాంఘిక భద్రత లేకుండా చేయడమే ప్రభుత్వాలఉద్దేశ్యమన్నారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, విద్యుత్ రంగం నాయకులు గౌస్, శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి రాంబాబు, చెన్నయ్య, నాగరాజు, వెంకటరమణ, మంగమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : వ్య.కా.స

మతోన్మాద, కార్పొరేట్ నాయకత్వంలో కేంద్రంలో నడుస్తున్న మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, శ్రమజీవుల రక్తమాంసాలను భుజించే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తూ నిర్ణయం చేసిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట లేబర్ కోడ్‌లకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను హరించేసనవని శ్రామికుల సమస్యల పరిష్కారంలో కేంద్రం వైఫల్యం చెందిందని విమర్శించారు. లేబర్ కోడ్లు ఫలితంగా కార్మికుల జీవన స్థితిగతులలోనూ పని పరిస్థితులలోనూ ఎలాంటి మార్పులు జరగవని కోట్లాది కార్మికుల ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు సుధీర్ కుమార్, నాగరాజు, వీరభద్ర, నరేంద్ర పాల్గొన్నారు.

రాయచోటి : నోటిఫికేషన్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు, కార్మికులు

రాజంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు, ఎఐటియుసి కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, మున్సిపల్ వర్కర్ నాయకులు లక్ష్మీదేవి, సాయికుమార్, రమేష్, రమేష్ నాయక్, ఎర్రోడు, ఎఐటియుసి నాయకులు రమణ, కోవెట్ల సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.

పీలేరు: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మద్దతుగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్లను వెంటనే రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో కార్మికులు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విధులను పరిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు బి.వి.రమణ, కార్యదర్శి ఓబులయ్య, కోశాధికారి నాగార్జున, పులి రెడ్డప్ప, రమేష్, మస్తాన్, రాజేశ్వరి, సరోజ, శాంతికుమారి, వెంకటరమణ, ఎల్లయ్య, నాగమ్మ, నజీర్ పాల్గొన్నారు.

పుల్లంపేట : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగంపేట ఎపిఎండిసి కార్మికుల (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎపిఎండిసి జెఎసి పోరాట కన్వీనర్ ఆర్.వెంకటేష్, నాయకులు పులగంటి రమణయ్య, హరికృష్ణ, హరి, సందీప్‌రెడ్డి, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మావిళ్ళ రాధా, వెంకటేష్, త్రివేణి మైనింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు, సురేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న కార్మికులు

పీలేరు : నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పుల్లంపేట : నిరసన తెలుపుతున్న ఎపిఎండిసి కార్మికులు

అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

- 27న సిసిఎల్ఎ కార్యాలయం ముట్టడి

- వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వం మంత్రివర్గంలో తీర్మానించిన అసైన్డ్ చట్ట సవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జిల్లా నాయకులు సుధీర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములకు రక్షణ కవచంగా ఉండే అసైన్డ్ చట్టాన్ని ప్రభుత్వం పరిరక్షించాల్సింది పోయి సవరించి, పేద ప్రజలకు భూములను దూరం చేసే విధంగా, వ్యవహరిస్తూ అన్యాయం చేస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53 లక్షల ఎకరాల భూములను పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేశారని తెలిపారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 28 లక్షల కుటుంబాలకు 33.50 లక్షల ఎకరాల భూములను పంచినట్లుగా లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఈ భూముల పరిరక్షణ కోసం 1977లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ శంకరన్ 9/77 అసైన్డ్ చట్టాన్ని తీసుకువచ్చి పేదల ఆరాధ్య దేవుడయ్యాడని తెలిపారు. ఈ చట్టం అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా అమ్మడానికి, కొనడానికి వీలు లేకుండా, పేదల భూములకు రక్షణ కవచంగా ఉందని అన్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు అనేక కుట్రలు కుతంత్రాలు పన్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో సుమారు 20 వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అనంతరం 20 వేల ఎకరాల భూములపై, ఇతర అసైన్డ్ భూములపై నిషేధాన్ని విధించి ప్రజానీకానికి మేలు చేస్తున్నట్లుగా భ్రమలు కల్పించిందని తెలిపారు. నిషేధం విధించడం పట్ల కూటమి ప్రభుత్వ చర్యలను ప్రజానీకం స్వాగతించి హర్షించారని అయితే ప్రజల నమ్మకాన్ని నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన అసైన్డ్ చట్ట సవరణ చేస్తూ నిషేధాన్ని ఎత్తివేయడమే కాకుండా అన్యాక్రాంతమైన భూములను 66 ఏళ్లకు, 99 ఏళ్లకు లీజుకు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేసి పేదల భూములను కబ్జాదారులకు, పెత్తందారులకు కట్టబెట్టే విధంగా చట్ట సవరణ చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం అసైన్డ్ భూముల రైతులతో కలిసి, ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఈ నెల 27న విజయవాడలోని సిసిఎల్ఎ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చామని జిల్లా నుండి కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం చేసిన చట్ట సవరణను ఉపసంహరించుకునేంతవరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రెడ్డయ్య, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు శంకర్ నాయక్, దళిత సంఘం నాయకులు పామయ్యలు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చట్టాన్ని నీరు గార్చే ప్రయత్నం చేసి, విఫలం చెందిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆనాడు వైసిపి చర్యలను తప్పుబట్టి, నేడు అసైన్డ్ భూముల రక్షణ కవచంగా ఉన్న అసైన్డ్ చట్టాన్ని, చట్ట సవరణ చేసి పేదల వద్దనుండి భూములు అతి సునాసాయంగా కోల్పోయే విధంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మంత్రి వర్గ సమావేశంలో చేసిన అసైన్డ్ చట్ట సవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల ఆగ్రహ వేషాలకు కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి సుధాకర్, చుక్క వీరభద్ర, పులిమి వెంకటరమణ,రెడ్డి ప్రసాద్ గాలివీటి రామానుజులు, మధ్యాహ్నపు పండరయ్య, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

లావణ్యను హత్య చేసిన భర్త, అత్తను శిక్షించాలి

- ఐద్వా జిల్లా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ

లావణ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాళ్లపారాణి ఆరక ముందే, అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసి పెళ్లైన రెండు నెలలకే నవ వధువు లావణ్యను ఉరి వేసి హతమార్చిన భర్త, అత్తను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ, మదనపల్లె పట్టణ కార్యదర్శి రెడ్డిప్రసన్న డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా సభ్యులతో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మీకు న్యాయం జరిగేవరకూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ మండలంలోని బండకాడపల్లికి చెందిన భాను, నాగేశ్వరి దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారన్నారని తెలిపారు. తండ్రి చిత్తూరు బస్టాండ్‌లో చిన్న వ్యాపారం చేసుకుంటుండగా తల్లి కూలి పనులకు వెళుతుందన్నారు. పెద్ద కుమార్తె లావణ్యను బసినికొండకు చెందిన ప్రమీల కుమారుడు వెంకటేష్‌కు ఇచ్చి రెండు నెలల క్రితం వివాహం జరిపించారన్నారు. ఎలక్ట్రీషిన్ పని చేసే వెంకటేష్ తల్లి ప్రమీలతో కలిసి భార్య లావణ్యను వరకట్నం కోసం హిసించేవారని, మిగిలిపోయిన, పాచిపోయిన ఆహారం తినాలని బలవంతం చేసేవారని, ఆరోగ్యం బాగా లేకపోతే పట్టించుకునేవారు కాదన్నారు. లావణ్యను వదిలించు కోవడానికి భర్త వెంకటేష్, అత్త ప్రమీల ఇద్దరే ఉరివేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారన్నారు. కాబట్టి నవవధువును చంపిన భర్త వెంకటేష్, అత్త ప్రమీలను కఠినంగా శిక్షించాలని, లావణ్య తల్లిదండ్రులకు ముగ్గురు చెల్లెళ్లకు రక్షణ, భద్రత కల్పించాలన్నారు. ఈ విషయంలో పోలీసులు చట్టపరంగా, న్యాయంగా వ్యవహరించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని విన్నవించారు. బాధితులను కలిసిన వారిలో ఐద్వా సభ్యులు ఎస్.సమియా జి.అంజలి, ఎస్.షాహీన, జానకి ఉన్నారు.

ఆపదలో స్వీయ సంరక్షణ ప్రతి ఒక్కరికీ అవసరం

ప్రజాశక్తి-రాజంపేట

ఆపదలో స్వీయ సంరక్షణ ప్రతి ఒక్కరికీ అవసరమని ప్రధానోపాధ్యాయులు కె.భారతి అన్నారు. మండల పరిధిలోని కొత్త బోయినపల్లి పిఎంశ్రీ ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భారతి ఆధ్వర్యంలో శనివారం బాలికలకు స్వీయ సంరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటే, తేక్వాండో వంటి యుద్ధ కళలు శారీరక, మానసిక క్రమశిక్షణ, స్వీయ సంరక్షణ నైపుణ్యాలను అందిస్తాయని పేర్కొన్నారు. ఒక వ్యక్తి తనకు లేదా ఇతరులకు హాని జరగకుండా తనను తాను రక్షించుకోవడానికి ఇవి ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులు సాధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు తేక్వాండో శిక్షకులు మనోజ్ కుమార్, ఐశ్వర్య ఆత్మరక్షణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మొలక ఓబులేసు, పుత్త జనార్ధన్, పారా శ్రీరాములు, బి.శేషగిరి, ఎస్.వి.రామరాజు, శివప్రసాద్ గౌడ్, ఎస్.ప్రభాకర్ రావు, విజయబాస్కర్, అనిల్ కుమార్, ఎన్.రాజయ్య, అమరావతి, సువర్ణ సుందరి, మధుర వాణి, దార్ల శ్రీనివాసులు ఆచారి, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకోండి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

పేదల వైద్యం కోసం, పేద విద్యార్థుల వైద్య విద్య కోసం నిర్మించిన మెడికల్ కళాశాలను ప్రయివేటుపరం కాకుండా చూడాలే, తప్ప మెడికల్ కళాశాలలు నిర్మించిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని విమర్శించడం తగదని తంబళ్లపల్లె వైసిపి నాయకులు టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ చినబాబుకి హితువు పలికారు. శనివారం పట్టణంలోని బసినికొండ వద్ద ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కార్యాలయంలో వైసిపి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. తంబళ్లపల్లె ఎంపిపి కోటిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కన్నెమడుగు ఎంపిటిసి మహేష్, ములకలచెరువు బూత్ లెవెల్ కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాషా, సీనియర్ నాయకులు జయనారాయణరెడ్డి, సర్పంచ్ సాంబశివారెడ్డి, కుక్కరాసిపల్లి రమేష్, అమర్నాథ్‌రెడ్డి, మద్దిరెడ్డి, నరేంద్రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.26 కోట్లు ఖర్చు పెడితే రూ.3 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని శ్రీరామ్ చినబాబు ఎక్కడపడితే అక్కడ వాగడం తగదన్నారు. అతని వద్ద ఆధారాలుంటే కళాశాల వద్దకు రావాలని ఆదివారం ఉదయం 10 గంటలకు తాము ఆధారాలతో అక్కడ ఉంటామన్నారు. మరోసారి ఆరోపణలతో విమర్శలు చేస్తే శ్రీరామ్ చినబాబుకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించి చంద్రబాబు దృష్టిలో పడితే పదవి వస్తుందని ఆశిస్తున్న చినబాబు ఆశలు కలలుగానే మిగిలిపోతాయే తప్ప అలాంటి పరిస్థితి ఉండదనే విషయాన్ని గ్రహించాలన్నారు. మరోసారి పెద్దిరెడ్డి కుటుంబంపై నోరుజారితే తంబళ్లపల్లిలో అడుగు పెట్టనీయమని, ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, ప్రజలకు మంచి చేయాలే తప్ప పెద్దల మెప్పు కోసం పాకులాడవద్దని సూచించారు.

షాదీమహల్‌ను పూర్తి చేయండి

- మంత్రి ఫరూక్‌కు టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలోని ఇంద్రానగర్‌లో అసంపూర్తిగా ఉన్న షాదీమహల్‌ను పూర్తిచేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, నాయకులు విన్నవించారు. శనివారం మంత్రి ఫరూక్ మదనపల్లి పట్టణంలో పర్యటించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాస గృహం వద్ద జరిగిన మైనార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో కమ్యూనిటీకి సంబంధించి అభివృద్ధి, సంక్షేమం, సమస్యల గురించి ప్రస్తావించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ముస్లింల వివాహాలకు సంబంధించి మదనపల్లెలో షాదీమహల్‌ను 2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించడం జరిగిందన్నారు. సుమారు 25 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు పూర్తి కాలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేసి షాదీమహల్ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్, సాజిద్, దాదు, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట: ఈ నెల 17న ప్రారంభమై 30వ తేదీ వరకు జరిగే కుష్టు వ్యాధి సర్వే వంద శాతం పూర్తి కావాలని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ రాధిక సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం ఆమె రాజంపేట పట్టణ పరిధిలోని రామ్ నగర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటికి కుష్టు సర్వేను తనిఖీ చేశారు. వైద్యులు, ఆయాలను సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో కుష్టు వార్డు, టిబి వార్డు, ఎఆర్‌టి కార్యాలయం, బ్లడ్ బ్యాంకు స్టోరేజీ వార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే పక్కాగా నిర్వహించాలని, ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి 30వ తేదీ లోపు వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మీప్రసన్న, సౌజన్య, వికాస్, టిబి జిల్లా సూపర్వైజర్ సుధాకర్, ఏరియా సూపర్వైజర్ జయప్రకాష్, ఫిజియోథెరపిస్ట్ గురప్ప, మల్లిఖార్జున, శివరాం పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంతి వేడుకలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి : ఆదివారం జిల్లా వ్యాప్తంగా శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లుగా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల స్థాయిలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల నేతృత్వంలో సత్యసాయి బాబా భక్తులు, ఎన్‌జిఒల సమన్వయంతో జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు ఈ వేడుకల నిర్వహణపై తగిన ఆదేశాలు జారీ చేసినట్లుగా పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రాయచోటి: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ ఆర్థిక సహాయంతో మూడు నెబులైజేషన్ మిషన్లను ఆస్పత్రికి అందజేసినట్లు అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్ దాత వి.హరీష్ చంద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెబులైజేషన్ మిషన్ కొరత ఉన్నందున నా వంతుగా మూడు అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని పీలేరులో 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారులను తీసుకువచ్చి రాజీ మార్గంలో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని తెలిపారు. క్రిమినల్, కాంపౌండ్, మ్యాట్రిమోనియల్, కుటుంబ తగాదాలలు, మోటార్ వాహన కేసులు, ఎన్ఐ యాక్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎక్సైజ్, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ కేసులు, ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసులను కూడా రాజీ చేసుకోవచ్చని తెలియజేశారు.ఈ అవకాశం అందరూ సద్వినియోగం చేసుకుని ఈ జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకునేలా చూడాలని సూచించారు. తెలియజేశారు. కక్షిదారులు లోకదాలకు వచ్చే సమయంలో తమ ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తప్పకుండా తీసుకు వచ్చేలా చూడాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, ఎపిపి శారద, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహాసభల పోస్టర్లను యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, నరసింహ, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో మహా సభలను నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. బకాయిలు ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. గిరిజన విద్యార్థుల మరణాలు రోజురోజుకీ పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని, గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తూ, విద్యా రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. యూనివర్సిటీలో ఖాళీలను భర్తీ చేయాలని, జూనియర్, డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిధులతో పాటు అఖిలభారత నాయకత్వం విద్యా మేధావులు రాష్ట్ర మహాసభల్లో పాల్గొంటారన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున్న పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికారి గంగిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు నాగరాజు, రామచంద్ర, చలపతి, రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, సుల్తాన్ పాల్గొన్నారు.

అవాంఛనీయం!

ప్రజా'దృష్టి'

ఆన్‌లైన్ బెట్టింగ్, డిజిటల్ మోసాలు పెరిగిపోయాయి. కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు, వేంపల్లి, మదనపల్లి కేంద్రాలుగా క్రికెట్ బెట్టింగులు మొదలుకుని డిజిటల్ మోసాలు, కిడ్నీ రాకెట్లు వంటి అవాంఛనీయ ధోరణులు పెచ్చరిల్లాయి. అత్యాశ, దురాశల బారిన పడిన యువత, వైద్యులు విలువైన జీవితాల్ని మసకబార్చుకుంటుండడం శోచనీయం. అవాంఛనీయ ధోరణుల్ని నివారించడం పోలీసులకు సవాల్‌గా మారింది. బెంగళూరు కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల్ని ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన బృందం వలపన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వేంపల్లి మండలానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నుంచి ఢిల్లీకి చెందిన కొంతమంది అపరిచిత వ్యక్తులు రూ.లక్షలాది డిజిటల్ చోరీకి పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఉన్నత విద్యావంతులైన యువత పెడధోరణుల బారినపడి సమస్యలమయం చేసుకుంటున్న సంగతిని గ్రహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అవకాశాల్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించే ప్రయత్నం చేయాలి. కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. అతిస్వల్ప వ్యవధిలో డబ్బులు సంపాదించాలనే దురాశతో ఆపదల పాలవడం సరికాదనే సంగతిని గ్రహించాలి. ఆశ పడాలి కానీ అత్యాశ పడకూడదు. దురాశ అసలే తగనిపని అని గ్రహించాలి. ఈ నెల 19న కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సఫలీకృతమైంది. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిరాశ పరుస్తోంది. చట్టబద్ధమైన భూముల ఆన్‌లైన్, ఇకెవైసి చేయడంలో అంతులేని నిర్లక్ష్యం చేస్తోంది. చట్టబద్ధత లేని భూములను ఆన్‌లైన్ చేయడం వంటి వ్యతిరిక్త ధోరణుల్ని కలిగి ఉందని చెప్పాలి. ఇటువంటి ధోరణుల్ని సరిచేయడానికి జిల్లా అధికార యంత్రాంగం సైతం నిర్లిప్తతకు దిక్సూచీగా మారిందని చెప్పవచ్చు. ఈ ఏడాది మేలో నిర్వహించిన టిడిపి మహానాడు బహిరంగ సభ వేదికపై నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.వెయ్యి కోట్లతో జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు చేపడతామన్న హామీ ఆమలుకు నోచుకోలేదు. తాజాగా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండల పర్యటనలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పిఎ కిసాన్ కార్యక్రమ వేదిక నుంచి ఈ ఏడాదిలోనే సర్వరాయసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలిస్తే సర్వరాయసాగర్ రిజర్వాయర్ కట్ట పనుల పెండింగ్‌ను అలా ఉంచితే, పంట కాల్వల పనులకు సంబంధించి రూ.36 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. పంట కాల్వలకు నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియదు. ఎమ్మెల్యే సిఎం ఇచ్చిన హామీ ప్రకారం పంటల కాల్వల నిధుల కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ఓటర్ జాబితాను సవరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామాపురం

2002 ఓటర్ జాబితాను సవరించాలని రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పివిఆర్ రికార్డులు సక్రమంగానిర్వహణ చేస్తున్నారా లేదా అని తహశీల్దార్, విఆర్ఒ, విఆర్ఒలలాగిన్లను పరిశీలించారు. మండలంలో రెవెన్యూ సమస్యల పై ఆరా తీశారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యవసర వస్తువులు సరఫరా సక్రమంగా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు ప్రజలను కార్యాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగాచూడాలన్నారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తాహశీల్దార్ కృపావళి, విఆర్ఒ, విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దినకర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి యువ నాయకుడు సిబ్బల దినకర్ గౌడ్ సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ అందరి మన్ననలు పొందుతుండటం అభినం దనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. కలికిరి మేజర్ పంచాయతీ అండే కురవపల్లికి చెందిన దినకర్ గౌడ్ గతంలో ఎన్నో సార్లు ఆలయాలకు విరాళాలు, పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, అభాగ్యులకు ఆర్థిక సాయం వంటి సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. పట్టణంలో టిడిపి యువ నాయకుడుగా ఎదుగుతున్నాడని అభినందించారు. శనివారం ఎమ్మెల్యే నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో కలికిరి పంచాయతీ, చెరువు ముందరపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా నగదు 20వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో వంట వెంకటరమణ, చంద్ర, యర్రయ్య చిన్నప్ప, మునాఫ్, శివయ్య, మేస్త్రి చంద్ర, అప్పి, ధన పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి-కలికిరి

జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) కింద వారం రోజులపాటు శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎస్‌వి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆరవ రోజు భాగంగా జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల, వెటర్నరీ ఆసుపత్రి దగ్గర, రైతు సేవ కేంద్రం దగ్గర, పలు ప్రభు త్వ కార్యాలయాల దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వేప, వెదురు, కానుగ, చింత, మొదలైన మొక్కలను నాటారు. అనంతరం డ్వాక్రా మహిళలకు, గ్రామీ ణ యువతకు అదనపు ఆదా యం పొందడానికి వ్యవసాయ సంబంధిత కుటీర పరిశ్ర మాలైన పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, విలువ ఆధారిత పౌష్టికాహా రాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రదీప్, అసోసియేట్ డీన్ రిప్రజెంటేటివ్ జ్యోతి, పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంఇఒ పద్మావతి పిలుపునిచ్చారు. మోడల్ ప్రైమరీ స్కూల్లో హెచ్ఎం భాస్కరన్ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని బాలాజీ కాలనీ నివాసముండే టిడిపి కార్యకర్త నిరుపేద గోసల శేఖర్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీనాయక్ శేఖర్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలకు తనవంతు సహాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మెరుగైన పారిశుధ్య సేవలకు కృషి

ప్రజాశక్తి-చిన్నమండెం : గ్రామాలలో మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని వెలుగు సంఘాలకు ఎంపిడిఒ ఆదినారాయణ సూచించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో వెలుగు సంఘాలకు పారిశుధ్యంపై శిక్షణా కారక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో చెత్తాచెదారం ఉండడంవల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు కలిగిస్తాయని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో ఎక్కడెక్కడ చెత్త ఉందో వాటిని శుభ్రపరిచే విధంగా చూడాలని ఆయన వెలుగు సంఘాలకు ఆదేశించారు.

కెజిబివి స్కూల్ సందర్శన..

మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంను ఎంపిడిఒ ఆదినారాయణ సందర్శించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల వివరాలు, విద్యార్థుల సంఖ్య గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బాధ్యతయుతంగా చూసుకోవాలని సూచించారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దిరెడ్డి కటుంబాన్ని విమర్శిస్తే పదవులు వస్తాయని ఏది పడితే అది మాట్లాడితే పెద్దిరెడ్డి కుటుంబ అభిమానులు చూస్తూ ఉండరని విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అభిలాష రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పెద్దిరెడ్డి కుటుంబం పై తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక కౌన్సిలరుగా గెలవలేని శ్రీరామ్ చినబాబు ఓటమెరుగని పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శన మన్నారు.పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేస్తేమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు.

పటిష్టంగా వంద రోజుల ప్రణాళిక : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

డిసెంబర్ 6వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళిక ప్రారంభమవుతుందని దానిని పటిష్టంగా అమలు చేయాలని ఎంఇఒ-1 జి.చక్రధర్‌రాజు అన్నారు. శనివారం హైస్కూల్ సబ్జెక్టు ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం మండల పరిధిలోని అనంతంపల్లి హైస్కూల్‌లో జరిగినది. ఈ సమావేశాన్ని విద్యాధికారులు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యేలా బోధించాలని అన్నారు. విద్యాధికారి -2 నాగ తిరుమలరావు మాట్లాడుతూ గైర్హాజరు అవుతున్న విద్యార్థుల కారణాలు తెలుసుకొని వారు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేట్టుగా హెచ్ఎం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఫణీంద్ర, అన్ని పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: PENUKONDA, [SRI SATYASAI DIST]
E.A.No.28/2025 in E.P.No.1/2013 in O.S.No.35/1992

Between:
Rangamma died by L.Rs,
Kamsala Rajeswari & others ...**Petitioners/ D.Hrs**
AND
Saradamma & others ...**Respondents/ J.Drs**

NOTICE TO:
D4: M.V. Jyothi w/o M.V. Thulasi Ram, Kodumuru (V), Kodumuru (m), Annamayya (D),
D5: M.V.Trilochana w/o Nagachari, Kodumuru (v), kodumuru (V), Annamayya (D),
D6: M.V.Gayathri w/o Karthik, Kodumuru (v), Kodumuru (m), Annamayya (D),
D7: M.V. Bindu D/o M.V.Tulasi Ram, Kodumuru (v), Kodumuru (m), Annamayya (D),

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై దావాలో మీ హాజరు నిమిత్తమై 01/12/2025 న వాయిదా వున్నది. కావున ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరు కావలెను. లేనిచో పై దావా మీ పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
L.VISWANATH,
Advocate, Penukonda.

నిధులు మంజూరులో జాప్యం తగదు

- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు ఇబ్బందులు పడుతున్నామని నిధులు మంజూరులో జాప్యం లేకుండా చూడాలని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు.మండల అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలన్నారు. వైఎస్ ఎంపిపి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని ప్రోటోకాల్ పాటించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రథమ పౌరులైన సర్పంచ్‌కు కూడా గౌరవం ఇవ్వడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు. మండల సమావేశానికి ఇంత మంది పోలీసులు భద్రత అవసరం లేదన్నారు.ఎప్పుడో ఏడాదికిందం జరిగిన సంఘటన మరల పునరావృతం కాదని అలాంటప్పుడు ఇంత భద్రత అవసరం లేదని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన ట్రాన్స్‌కో ఎఇకి నోటీసులు అందివాలని ప్రజా ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో డిటి.నారాయణరావు, వైస్ఎంపిపి-2 గాలి శ్రీనివాసులు, ఎంపిటిసిలు, సర్పం చులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్

రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో సత్తాచాటిన హాసిని

హాసిని అభినందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి రాంనగర్‌కాలనీకి చెందిన ప్రతాప్‌కుమార్ కుమార్తె హాసిని రాష్ట్రస్థాయిలో 100, 200మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటింది. కలికిరి టి.చదివేవాండ్లపల్లి జడ్‌పి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న హాసినిని శనివారం గండబోయినపల్లి శ్రీసత్యమ్మతల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి సద్దల చక్రపాణి కమిటీ సభ్యులు అమర్నాథ్ రెడ్డి, రమేష్ బాబు, ఓబుల్ రెడ్డి, సర్పంచ్ గుర్రప్ప గంగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దొరబాబురెడ్డి, హాసినిని అభినందించి సహకారం అందించారు.ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ ఇలా రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం అందులో కలికిరికి సంబంధించిన బాలిక కావడం తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. హాసిని జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి, సద్దల చక్రపాణి మాట్లాడుతూ కలికిరి మండలా నికి చెందిన అమ్మాయి హాసిని రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో రాణిస్తున్నందుకు గర్వకారణంగా ఉందన్నారు. వ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అమరనాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్ బాబు, సర్పంచ్ గుర్రప్ప, సుధాకర్‌రెడ్డి, గంగిరెడ్డి, దొరబాబు రెడ్డి, పూజారి ఉత్తన్న, కృష్ణప్ప ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ దత్తత దినోత్సవం

ప్రజాశక్తి-వీరబల్లి

మాతృత్వం ఒక వరం దత్తత అందుకు మరో మార్గమని జిల్లా ఐసి డిఎస్ పిఒ రామలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని సానిపాయి పంచా యతీ లెగిసెట్టివారిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో బాలబాలికల సంరక్షణలో భాగంగా జిల్లా శిశుగృహ ప్రత్యేక దత్తత విభాగం అంతర్జాతీయ దత్తత మాసోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది సంతానం లేక ఎన్నో ప్రయత్నాలు చేస్తూ తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. మరి కొందరు మూఢనమ్మకాలు, ఆడపిల్ల అంటేనే భారంగా భావించడం, ఆర్థిక భారం, నిరక్షరాస్యత, పలు వ్యక్తిగత కారణా లతో తమ పిల్లలను పురిట్లోనే వదిలేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు వది లేసిన శిశువులను స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారిని శిశు గృహానికి తరలించి ఆలనా పాలన చూస్తున్నారని తెలిపారు. ఇలాంటి పిల్లలను చట్ట బద్ధంగా దత్తత సైతం ఇస్తున్నారని తెలిపారు. పిల్లల లేని వారికి ఇది ఒక వరం లాంటిదని చెప్పారు. దత్తత కొరకు పిల్లలు లేని తల్లిదండ్రులకు కావాల్సిన పత్రములు, అనాథ పిల్లలు, వదిలివేయబడిన పిల్లలు, అప్పగించబడిన పిల్లలు, సంరక్షణ అవసరమైన పిల్లలతో సంతానం లేని తల్లిదండ్రులకు ప్రేమను పంచే కుంటుంబాన్ని ఏర్పాటు చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. 0 నుంచి 18 సంవత్సరాలు గల పిల్లలని ఎవరైనా అనధికారికంగా దత్తత తీసుకున్నట్లయితే వారి గురించి 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాల్యవివాహాలు, పోక్స్ యాక్ట్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్పాన్సర్ షిప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి శిశు గృహ నుంచి సామాజిక కార్యకర్త గాయత్రి, హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, స్కూల్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దత్తతపై అవగాహనకల్పిస్తున్న పిఒ రామలక్ష్మి

పార్టీ కోసం కష్టపడే వారిని విమర్శించం

- టిడిపి సీనియర్ నాయకులు మార్పూరి సుధాకర్ నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే ఏ ఒక్కరిని తాము విమర్శించమని మదనపల్లె నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు మార్పూరి సుధాకర్‌నాయుడు, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ. మస్తాన్ తెలిపారు. శనివారం వీరు వేర్వేరుగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల కిందట అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన తంబళ్లపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త సీడ్స్ మల్లికార్జుననాయుడును పరామర్శించామన్నారు. ఈ సమయంలో తాము టిడిపి నాయకులు కట్టా దొరస్వామినాయుడుపైన విమర్శలు చేసినట్లు పుకార్లు రావడం అసత్యమన్నారు. అసలు సీడ్స్ మల్లికార్జున రెడ్డి వద్ద ఎలాంటి రాజకీయ విషయాలు చర్చించలేదని పేర్కొన్నారు. కట్టా దొరస్వామి నాయుడు టిడిపి బలోపేతం కోసం బాగా పనిచేశారని, చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని హోమం సైతం నిర్వహించినట్లు వివరించారు. ఇలాంటి నాయకుడిని తాము విమర్శించలేదని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం చెన్నై లోని వైద్యశాలకు వెళ్లాలని తాము మల్లికార్జున నాయుడుకు సూచించామన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కూడా స్పందించి ఫోన్‌లో మల్లికార్జున నాయుడుతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా తాను చర్యలు తీసుకుంటానని చెప్పారని వారు తెలిపారు.

సంఘమిత్రపై చర్యలు తీసుకోండి

- అధికారులకు ఫిర్యాదు చేసిన డ్వాక్రా సంఘ సభ్యురాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళా సంఘ సభ్యులపై దురుసుగా ప్రవర్తిస్తూ, వారికి సంఘం ద్వారా రుణాలు తీసి ఇవ్వకుండా వేధిస్తున్న ఓ సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ రమేష్‌బాబుకు డ్వాక్రా సంఘం సభ్యురాలు నమీరా బేగం సంఘ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ముష్టూరు గ్రామం చల్లావారిపల్లెకు చెందిన తాను డ్వాక్రా సంఘంలో భారతి సంఘంలో సభ్యురాలుగా కొనసాగు తున్నా నన్నారు. తమ గ్రూపులో 10మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. గత నెల రోజుల క్రితం ఫిర్యాదురాలు నమీర బేగంకు, వారి కుమార్తెకు ఇద్దరికీ అనారోగ్య సమస్యలు తలెత్తి ఆపరేషన్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ క్రమంలో ఆపరేషన్ కోసం అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయని తెలిపారు. తమ డ్వాక్రా గ్రూపు నుంచి లోను తీసుకోవడానికి తమ సంఘమిత్రను ఆశ్రయించడం జరిగిందన్నారు. సంఘమిత్ర తమను హేళనగా మాట్లాడుతూ తమ పట్ల దురుసుగా ప్రవర్తించిందని లోను మీకు తీసి ఇవ్వడానికి కుదరదని వెనక్కి పంపించిందన్నారు. దీనిపై తమ వెలుగు అధికారి సిసి వద్దకు వెళ్లి సమస్యను వివరించగా, గ్రూపు సభ్యులందరూ కలిసి నిర్ణయించుకొని అంగీకార పత్రాన్ని సంఘమిత్రకు చేర్చాలని తెలిపిందన్నారు. తాను గ్రూపు సభ్యులతో చర్చించి తమకు లోను మంజూరు కోసం అంగీకార పత్రాన్ని తీసుకొని సంఘమిత్ర వద్దకు వెళ్లగా ఆమె మాత్రం ఆ పత్రాన్ని తీసుకోలేదని, పైగా తమను అవమానపరుస్తూ హేళనగా మాట్లాడిందన్నారు. లోను తీసి ఇవ్వమని సంఘమిత్రను ఎంత బ్రతిమాలిన వినలేదని, పైగా చులకనగా తమ పట్ల ప్రవర్తించిందని ఆవేదన చెందారు. చేసేదేమీ లేక బయట వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పుచేసి ఆపరేషన్ చేయించుకున్నామని తెలిపారు. గతంలోనూ ఇదే సంఘమిత్రపై డ్వాక్రా సంఘ సభ్యులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందని ఫిర్యాదులు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాలలోని మహిళల అభ్యున్నతికి తోడ్పడాల్సిన సంఘమిత్ర ఆమె పరిధిలోని సంఘ సభ్యులపైనే దురుసుగా ప్రవర్తిస్తూ, వారికి రుణాలను మంజూరు చేయించకుండా వేదిస్తుందని ఇటువంటి సంఘమిత్ర పై వెంటనే చర్యలు తీసుకొని ఆమెను విధుల నుంచి తొలగించాలని కోరారు.

సంఘమిత్ర మాట్లాడుతూ... తాను ఎవరి పట్ల దురుసుగా ప్రవర్తించలేదని, నాపై ఫిర్యాదు చేసిన సంఘ సభ్యురాలికి లోను కొరకు ఇదివరకే దరఖాస్తు చేసామని, ఆమెకు లోను మంజూరు కావాల్సి ఉందన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : ఎఒ

చల్లావారిపల్లెకు చెందిన సంఘమిత్ర పై భారతి డ్వాక్రా సంఘ సభ్యురాలు నజీరా బేగం తమకు ఫిర్యాదు చేశారని తెఇపారు. దీనిపై ఎపిఎంతో కలిసి తాము క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు. విచారణలో సంఘమిత్రపై వచ్చిన ఆరోపణలు నిజమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆమెపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రచ్చబండకు విశేష స్పందన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న రచ్చబండ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పిటిఎం మండలంలో ఎమ్మెల్యే పర్యటించి కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి సంక్షేమం సక్రమంగా అందలేదన్నారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు బైపాస్ రోడ్‌లో బి.కొత్తకోట యువతతో ఎమ్మెల్యే మాట్లాడి కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టాలని,ప్రజలకు న్యాయం చేసే విధంగా అందరూ కృషి చేయాలని తెలిపారు. అటుగా వెళ్తున్న స్కూల్ పిల్లలను ఎమ్మెల్యేని పలకరించారు. పిల్లలతో ఎమ్మెల్యే మాట్లాడితే విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చక్కగా అర్థం చేసుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారుజ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ, సచివాలయ మాజీ కన్వీనర్ జి.చాంద్ బాషా, వైసిపి నాయకులు బిసికాలనీ బావజాన్, బాంబే మోదిన్,తుమ్మగింజలు జనార్ధన్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట

అధ్యాపకుడికి బిపి పరీక్షిస్తున్న విద్యార్థిని

64వ జాతీయ ఫార్మసీ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు వంద మందికి పైగా రక్తపోటు, చక్కరవ్యాధి, బాడీ మాస్ ఇండెక్స్ మొదలగు పరీక్షలు చేయించుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రాక్టీస్ విభా గం అధ్యాపక బృం దం డాక్టర్ మణిదీప్ రాయల్, వినీల హాసిని, విద్యార్థిని-విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. శనివారం టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలను తరచుగా తిప్పుకోకుండా సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అధికారులు జవాబు దారీతనంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పరూరల్ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జీ.వీ సుబ్బరాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కబ్జాపై సర్వే

ప్రజాశక్తి- కలకడ : శ్మశాన వాటిక కబ్జాపై సర్వే నిర్వహించినట్లు జిల్లా విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సభ్యులు పాలకొండ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని కోన గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 394లో ఎస్‌సిలకు కేటాయించిన శ్మశాన వాటికను ఒక ప్రయివేట్ వ్యక్తి కబ్జా చేసి తన పొలానికి దారి వేశారని, గత నెల జిల్లాలో జరిగిన డివిఎంసి సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి కబ్జాకు గురైన ఎస్‌సిలకు కేటాయించిన శ్మశాన వాటికకు హద్దులు చూపించాలని కలకడ తహశీల్దార్‌ను ఆదేశించారని తెలిపారు. తహశీల్దార్ స్థల పరిశీలనకు మండల సర్వేయర్ దేవిని ఆదేశించడంతో శనివారంసర్వే దేవి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి కోన పంచాయితీ ఎస్‌సి కాలనీ వాసులకు కేటాయించిన శ్మశాన వాటికను పరిశీలించినట్లు తెలిపారు. అందులో కొంత భూమి కబ్జాకు గురైందని త్వరలో ఎస్‌సిలకు కేటాయించిన శ్మశాన వాటికను సర్వే చేసి హద్దులు చూపిస్తామని తహశీల్దార్ తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో విఆర్ఒ రామకృష్ణ, టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు సాదు రామాంజులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక భూమిని కబ్జాపై సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

క్రైం కార్నర్

నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

- డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రియుడే కాల యముడయ్యాడు. ఐదేళ్లపాటు సహజీవనం చేసిన మనిషిని అంతమొందించాడు. ఆఖరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. శనివారం హత్య కేసులో నిందితుడిని తాలూకా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహేంద్ర, సిఐ కళా వెంకటరమణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని సిటిఎం పంచాయతీ పాకాలమందవీధిలో నివాసముంటున్న అర్జునరావు భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ(45) బంధువులతో కలిసి వీధి నాటకాలకు వెళ్ళేదన్నారు. ఖాళీ సమయాల్లో భవన నిర్మాణ పనులకు వెళ్లి జీవనం సాగించేదన్నారు. చిన్నాయన చెరుబుపల్లెకు చెందిన మంజునాథ్ అనే మేస్త్రీతో ఏర్పడిన పరిచయం అక్రమసంబంధానికి దారితీసిందన్నారు. గత కొంతకాలంగా అతని వద్ద పనులు మానేసి మరో మేస్త్రీ వద్దకు పనులకు వెళ్లేదన్నారు. మంజు నాథ్ అనుమానించి ఆమెపై కక్ష పెంచుకున్నాడని తెలిపారు. ఈనెల 16న రాత్రి పాకాలమంద వీధికి దగ్గరలో ఉన్న బీడు భూము వద్దకు సావిత్రమ్మ ను రమ్మని ఫోను చేశాడని తెలిపారు. రాత్రి 10 గంటలకు ఆ బీడు భూముల్లోకి వెళ్ళగా, ఆమెతో ఘర్షణపడి ఆమె మెడకు ఉన్న టవల్‌నే ఉరితాడుగా మార్చి ఆ టవలతో గొంతుకు బిగించి హత్య చేసి పరారయ్యాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారని తెలిపారు. వారం రోజుల వ్యవధిలోనే నిందితుడు మంజునాథ్‌ను పట్టుకుని అరెస్టు చేశామ న్నారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని, మొబైల్ ఫోనును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యాన్ని ప్రదర్శించి నిందితుడిని పట్టుకున్న సిఐ కళా వెంకటరమణ, వన్ టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషాను డిఎస్‌పి అభినందించారు.

ఇసుక టిప్పర్ సీజ్

ప్రజాశక్తి-కలకడ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌కుమార్ తెలిపారు. రాయచోటి వైపు నుంచిపీలేరు వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు అందిన ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడులను మండల కేంద్రమైన కలకడ సమీపంలో ఉన్న సత్యవతి నది వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సంబేపల్లి వైపు నుంచి పీలేరు వైపు ఇసుకతో వస్తున్న టిప్పరు ఆపడంతో టిప్పర్ డ్రైవర్ పక్కన ఆపి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా స్థానిక పోలీసులు అతని పట్టుకుని విచారించగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేవన్నారు. టిప్పన్‌ను స్వాధీనం చేసుకొని, గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పంచాయతీ శీలంవారి పల్లికి చెందిన టిప్పర్ డ్రైవర్ శివ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/తంబళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. తంబళ్లపల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఈదరచెరువు పల్లెకి చెందిన నరసింహులు కుమారుడు జె.మణికంఠ(21) సొంత పనిపై ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లికి వెళ్ళాడు. అక్కడ పనులు చూసుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. మరో కొన్ని క్షణాల్లో ఇంటికి చేరుబోతుండగా ఈదలచెరువుపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా మణికంఠ మృతి చెందాడు. ఇతనికి భార్య గీత, నాలుగు నెలల కుమార్తె ఉంది. కుమారుడు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు, భర్త ఇక లేడని తెలిసి భార్య ఆసుపత్రిలో కన్నీటి పర్యంతమయ్యారు, తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.